క్లుప్తంగా

నేడు వలంటీర్లకు వందనం కార్యక్రమం

నరసరావుపేట: పట్టణం, రొంపిచర్ల మండలంలో గురువారం వలంటీర్లు వందనం, మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు బుధవారం తెలియజేశాయి. వీటికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు టౌన్‌హాలులో పట్టణ పరిధిలోని వలంటీర్లకు వందనం, స్వాతంత్ర సమరయోధులు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4గంటలకు రొంపిచర్లలోని జెడ్పీ హైస్కూలు ప్రాంగణంలో మండల పరిధిలోని వలంటీర్లకు వందనం, వైఎస్సార్ ఆసరా కార్యక్రమం ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్లు, వలంటీర్లు, పలు కార్పొరేషన్ల డైరక్టర్లు, కన్వీనర్లు, పార్టీ బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మేథ్స్ ఒలంపియాడ్‌లో వినుకొండ విద్యార్థుల ప్రతిభ



వినుకొండ(నూజెండ్ల): శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిసెంబరు నెలలో నిర్వహించిన శ్రీనివాసరామానుజన్ మేథ్స్ ఒలంపియాడ్‌లో ఆగాబావి బజారులోని గీతమ్స్ గ్లోబల్ మైండ్స్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్.సూర్యనారాయణ తెలిపారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన అభిరామ్, షేక్ మొహమ్మద్‌సాబిత్, లిఖిత్‌లు ర్యాంక్‌లు సాధించి లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు జయప్రకాష్‌నారాయణ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. అవార్డులు అందుకున్న విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

అవాస్తవ రాతలవి.. ఆ వార్తలో నిజం లేదు

నరసరావుపేట: జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీలో ఎటువంటి అక్రమాలు జరగలేదని, పేదల బియ్యం.. వైకాపా నేతల భోజ్యం పేరుతో ఈనాడులో వచ్చిన కథనం అవాస్తవమని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్. పద్మశ్రీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో పౌరసరఫరాల అధికారులు, రెవెన్యూ ఉద్యోగులు నిరంతరం నిత్యావసర సరుకుల పంపిణీపై తనిఖీలు చేస్తూ ఏదైనా అక్రమాలు జరిగితే కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఈ ఏడాదిలో 102 కేసులకు సంబంధించిన వ్యక్తులపై 6–ఏ కేసులు నమోదు చేశామన్నారు. వారి వద్ద నుంచి 6,582 క్వింటాళ్ల బియ్యం సీజ్‌చేసి సదరు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు.

మైక్ సెట్ బహూకరణ



రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1979–80 విద్యా సంవత్సరంలో పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాలకు మైక్ సెట్ బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.వేణుగోపాల రావు మాట్లాడుతూ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి పాటుపడటం అభినందనీయమన్నారు. అనంతరం నరసరావుపేట ఉప విద్యాశాఖాధికారి వేణుగోపాలరావు చేతుల మీదుగా పూర్వవిద్యార్థులు పాఠశాలకు రూ.25వేల రూపాయలు విలువ చేసే మైక్ సెట్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు నలబోతు శివశంకర్, గోరంట్ల ఆదినారాయణ, పాలిమేర వెంకటరెడ్డి, ఇల్లూరి సాంబిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

వలంటీర్ల సేవలకు వందనం

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ వలంటీర్లు చేస్తున్న సేవకు వందనమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వలంటీర్ల వందనం మండలస్థాయి మహోత్సవం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. దీని ద్వారా 2.54 లక్షల మంది వలంటీర్ల నియామకం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 1500 మంది, మండలంలో 532 మంది వలంటీర్లు సేవలు అందిస్తున్నారని తెలిపారు. పెన్షన్ అందుకుంటున్న వృద్ధులకు పెద్ద కుమారుడిగా సీఎం జగన్ ప్రతినెలా 1వ తేదీన ఉదయాన్నే తలుపుతట్టి వలంటీర్ల ద్వారా పెన్షన్ అందజేస్తున్నారని తెలిపారు. కరోనా కష్టకాలంలో వలంటీర్ల అందించిన సేవలకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయని తెలిపారు. వలంటీర్ల సేవలు అందిస్తూ ప్రజలకు దగ్గరవుతుంటే తట్టుకోలేని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వారిని కించపరుస్తూ మాట్లాడుతున్నారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లను తొలగిస్తామని చెబుతున్నారని, వలంటీర్లు సేవలు కావాలో, వద్దో ప్రజలే నిర్ణయించుకోవాలని తెలిపారు. వలంటీర్లు కావాలి అనుకుంటే సీఎం జగన్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. పేదలకు ఎవరి హయాంలో మేలు జరిగిందో చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. చంద్రబాబు పల్లకి మోయడానికే పవన్ కల్యాణ్ పార్టీ నడుపుతున్నాడని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రుణాలు పూర్తిగా మాఫీ చేస్తానని చెప్పి చంద్రబాబు డ్వాక్రా మహిళలను మోసం చేశారని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని నాల్గవ విడతల్లో రూ.26 వేల కోట్లు మాఫీ చేశారని తెలిపారు. రాష్ట్రంలో 33 లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందించే కార్యక్రమం జరుగుతుందన్నారు. వలంటీర్లును బెదిరించే విధంగా టీడీపీ నాయకులు మాట్లాడుతున్నారని, అటువంటి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. వైఎస్సార్ సీపీ వలంటీర్లకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి వలంటీర్ల పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ స్వామి, ఖాజావలి మాస్టారు, ఎంపీపీ రవికాంత్ పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మహిళలకు ప్రాధాన్యత ఇచ్చింది జగనన్నే

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీ



బొల్లాపల్లిలో ఆసరా చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

బొల్లాపల్లి: మహిళ శక్తిని గుర్తించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పథకం అమలులో మహిళలకు అత్యంత ప్రాధాన్యత కల్పించారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీ చేశారు. వెలుగు పథకం ఏపీఎం పి.రంగారెడ్డి అధ్యక్షత జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, జ్యోతి ప్రజ్వల అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో ఒక్క బొల్లాపల్లి మండలంలో 772 మహిళ పొదుపు గ్రూపులు నాలుగు విడతలుగా రూ.21 కోట్ల మేర 7742 మంది లబ్ధిపొందారని తెలియజేశారు. ప్రతి ఏటా రూ 5.24 కోట్లు ఆసరా పథకంలో మహిళలు లబ్ధిచేకూరిందని తెలిపారు. నవరత్నాల్లో రూపొందించిన ప్రతి పథకంలో మహిళలకే ప్రాధాన్యత నిచ్చికుటుంబ ఆర్థిక ఎదుగుదలకు దోహదపడ్డారని గుర్తుచేశారు. కరోన కష్టకాలంలో సైతం రాష్ట ప్రజలను ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కిందని కొనియాడారు. కరోన సమయంలో ఇంటింటికీ వెళ్లి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఆరోగ్య భరోసా కల్పించారన్నారు. సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్టంలో అమలు చేయని ఆంధ్రప్రదేశ్ రాష్టంలో అమలు చేసి ప్రశంసలు పొందారని, నేరుగా పథకాలు లబ్ధిదారుని చెంతకే చేరాయన్నారు. మండలంలో నీటి సమస్యను గుర్తించి స్వతహాగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని, వరికెపూడిశెల నిర్మాణంతో తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వరికెపూడిశెల నిర్మాణానికి పూనుకుందన్నారు. ఇప్పటికే వేసవిని దృష్టిలో ఉంచుకొని మంచినీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. గతంలో మండలంలో రెవెన్యూ రికార్డులు లేవని, అప్పట్లో రెవెన్యూ కార్యాలయాన్ని పేల్చివేయడటంలో రికార్డులు లేవని, వివిధ ప్రాంతాల్లో ఉన్న రికార్డులు సేకరించి మండలంలో రైతుల సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. దాదాపు 10 వేల పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించామని తెలియజేశారు. ప్రస్తుతం భూ రిసర్వేతో పూర్తిస్థాయి రికార్డు తయారవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తి రాములు, వైఎస్ ఎంపీపీలు టీ కోటిరెడ్డి, బి మరియమ్మ, జడ్పీటీసీ ఆర్ బీమీ బాయి కృష్ణానాయక్, జీడీసీపీ బ్యాంకు డైరెక్టరు డి.గోవిందునాయక్, ఎంపీడీఓ వి.ఎ.విజయకుమార్, ఈఓపీఆర్డీ ఎస్‌కె జలానీబాషా, ఈపూరు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ బి.పద్మబాయి కాంతానాయన్, రాములు, వెంకటరెడ్డి, సాయిబాబు, బంగీ నాయక్, బ్రహ్మనాయక్, బాలునాయక్, హనుమానాయక్, గురవయ్య, రాజయ్య, మస్నేయ్య, సాంబిరెడ్డి, అవినాష్‌రెడ్డి. సూరిబాబు, చినగోవిందయ్య పాల్గొన్నారు.

లబ్ధిదారుడి చేతికి 'జగనన్న వికాసం'



జిల్లాలో జగనన్న బడుగు వికాసం కింద మంజూరైన రూ.16.16లక్షల విలువైన కియో కారును జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ లబ్ధిదారునికి బుధవారం అందజేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన నవోదయంలో గురజాల మండలానికి చెందిన కర్రా చైతన్య తనకు ఉపాధి కోసం కారు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అతడికి బ్యాంకు రుణం ద్వారా రూ.16.16 లక్షల విలువైన కారు మంజూరైంది. దీనిలో లబ్ధిదారుడు పదిశాతం భరించగా మిగతాది బ్యాంకు రుణ సహాయం చేసింది. దీనిలో లబ్ధిదారునికి 45 శాతం రాయితీ లభించనుంది. నవోదయం నోడల్ అధికారి కె.సంజీవరావు, ఇన్‌చార్జి డీఆర్వో అజయ్ కుమార్, డ్వామా పీడీ జోసఫ్ కుమార్ పాల్గొన్నారు. –నరసరావుపేట

ఘనంగా కేజీబీవీ వార్షికోత్సవం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల వార్షికోత్సవం, వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయినీలు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీడీపీవో ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన...

వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీడీపీవో అనురాధ విద్యార్థులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాలు, ఇబ్బందులపై 8వ తరగతి పిల్లలు నాటిక ద్వారా కళ్లకు కట్టినట్లుగా చూపించడం జరిగింది. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విన్యాసమ్మ, నాగరాజకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు జి.పద్మ, జి.అనురాధ, బి.వాణి, ఎం.ప్రసూన, ఎస్. అంజనీదేవి పాల్గొన్నారు.



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో అరుణ

నేడు తూబాడులో ఆలయ ప్రతిష్ట

నాదెండ్ల: తూబాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మీ అమ్మవారి దేవాలయ ప్రాణ ప్రతిష్టా కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 11.50 గంటలకు పుష్యమీ నక్షత్ర ముహూర్తాన ఆలయ యంత్ర ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమాలను శ్రీ పాంచరాత్ర భగవత్ శాస్త్రోక్త ప్రకారం నిర్వహిస్తామని, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం జరుగుతుందని తెలిపారు.

నేడు ప్రమాణ స్వీకారం

నరసరావుపేట రూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈనెల 22వ తేదీ గురువారం ఉదయం 11గంటలకు జరుగనున్నట్లు మార్కెట్ యార్డ్ సెక్రటరీ వినుకొండ ఆంజనేయులు తెలిపారు. నూతన చైర్మన్‌గా శనివారపు వాసుదేవరెడ్డి, వైస్ చైర్మన్‌గా పులుసు అన్నపూర్ణమ్మలతో పాటు కమిటీ సభ్యులుగా నూతలపాటి స్వరూప, కాసు కృష్ణవేణి, బాసల సామ్రాజ్యం, పేరుబోయిన రామయ్య, నక్కా వెంకట కోటేశ్వరరావు, బత్తుల పద్మలత, షేక్ బీబీ ఆషా, తడికమళ్ల చిన వెంకట నరసయ్య, తాతపూడి కవిత మాధూరి, కుంభ శ్రీనివాసరావు, పెనుగొండ ప్రభాకర్, బచ్చు రామనాగేశ్వరరావు, తడికమళ్ల చిన్న హనుమంత రావులు ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌లు పాల్గొంటారని తెలిపారు.

తిరునాళ్లకు చందాల వసూళ్లు అసత్యం

నరసరావుపేట: కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా కూలీకి 200 మంది ఉద్యోగులు, 400 మంది ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బంది నియామకం, వారి భోజన వసతి కల్పించటమనేది గత 20 ఏళ్ల నుంచి సాంప్రదాయంగా చేస్తున్న ప్రక్రియేనని జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ భాస్కరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరికి మూడురోజుల పాటు భోజనం, వసతి సౌకర్యాలు కల్పించటం జరుగుతుందన్నారు. దీనిపై రాజ్యాంగ బద్ధంగా విధులు నిర్వహించే ఉద్యోగులు చందాలు వసూలు చేస్తున్నారంటూ హేతువాద సంఘ నాయకుడు నార్నె వెంకట సుబ్బయ్య సామాజిక మాధ్యం వాట్సప్ ద్వారా చేసిన ఆరోపణలను ఖండించారు. దీనిపై ఎటువంటి సందేహాలు ఉన్నా జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కార్యాలయంలో సంప్రదించి నివృత్తి చేసుకోవాలని కోరారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

శావల్యాపురం: కంది పంట సాగు చేసిన రైతుల నుంచి నేరుగా రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ మద్దతూ ధర క్వింటా ధర రూ.9600 రూపాయాలకు కొనుగోలు చేస్తామని ఏడీఏ బోయపాటి రవిబాబు అన్నారు. బుధవారం మండలంలోని కనమర్లపూడి, శావల్యాపురం గ్రామాల్లో కంది పంట సాగు చేసిన పొలాలను సందర్శించారు. ఈసందర్భంగా ఏడీఏ రవిబాబు మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు కంది పంట సాగు చేసిన గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించి దళారుల నుంచి మోసపోకుండా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. కంది పంట సాగు చేసిన రైతులు ఆందోళన చెందరాదని,చివరి గింజ వరకు రైతుల నుంచి రైతుభరోసా కేంద్రాల ద్వారా గోనె సంచులు కూలీల ఖర్చు లేకుండా కొనుగోలు చేయటానికి రంగం సిద్ధం చేశామన్నారు. ఆయనతో పాటు ఏవో పల్లపోతుల ప్రవీణ్, ఏఈవో పురేటి అశోక, రైతుభరోసా సహాయకులరాలు వెంకయమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నాదెండ్ల: బుక్కాపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న అంకమ్మతల్లి ఆలయానికి వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు రూ.40వేలు విరాళంతో పాటూ వంద కట్టల సిమెంటు బస్తాలను అందించారు. ఈ మేరకు ఆయన సోదరుడు మల్లెల కోటేశ్వరరావు గ్రామాన్ని సందర్శించి ఆలయ కమిటీ సభ్యులకు నగదును అందించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చిన్నారులు కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను అభినందించారు. రూ.5 లక్షల వ్యయంతో ఐదు నెలల క్రిందట ఈ ఆలయాన్ని భూమి పూజ జరగ్గా, ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లం సాంబశివరావు, చట్టాల సాంబశివరావు, ఆంజనేయులు, రమేష్, అల్లం తిరుపతయ్య ఉన్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి వెండి అపహరణ

నరసరావుపేట టౌన్: ఇంటి తాళాలు పగుల గొట్టి బీరువాలో వెండి వస్తువులు అపహరించిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామిరెడ్డిపేట రాధా సుందర కళ్యాణ మండపం ఎదుట బి.సత్యనారాయణ నివశిస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి మార్కాపురంలోని తన కుమార్తె వద్దకు కుటుంబంతో సహా వెళ్లాడు. తిరిగి బుధవారం వచ్చి చూడగా ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. గృహంలోకి వెళ్లి చూడగా బీరువాలో ఉండాల్సిన వెండి వస్తువులు, విలువైన దుస్తువులు కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన సమాచారంతో వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మతుకుమల్లిలో వైద్యశిబిరం

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.శిబిరంలో సూపర్‌వైజరు అలవలపాటి ఏడుకొండలు, ఆరోగ్య కార్యకర్త లింగాల శ్రీలలితా వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

పేదల ఆరోగ్యానికి బాసటగా సీఎంఆర్ఎఫ్

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



చెక్కులు పంపిణీ చేస్తున్న మల్లెల రాజేష్ నాయుడు

చిలకలూరిపేట: పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో బాసటగా నిలుస్తున్నదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు చెప్పారు. పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పలువురికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యరంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నదని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ. 25 లక్షలకు పెంచటంతో పాటు, అత్యవసర సమయాల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందజేస్తున్నదని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతి వారికి డబ్బు మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి తన సహృదయత చాటుకుంటున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా యడ్లపాడు మండలం ఉప్పరపాలెం గ్రామానికి చెందిన పల్లపు అనురాధకు రూ. 4 లక్షలు, పట్టణానికి చెందిన కేతావతు వంశీనాయక్‌కు రూ. 1.50 లక్షలు, చుండూరు వెంకట్రావుకు రూ. 58 వేలు, నాదెండ్ల మండలం అప్పాపురం గ్రామానికి చెందిన కందుల గణేష్‌కు రూ.30 వేలు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొంటు శ్రీనివాసరెడ్డి, బిట్రా రాజేంద్రప్రసాద్, సింగరేసు పోలయ్య, రంజిత్, వడితే పసనానాయక్, కేతావతు తులసిబాయి, విడదల పెద్ద విష్ణు పాల్గొన్నారు.

గణపవరం బేకరీలో చోరీ

- వరుస దొంగతనాలతో గ్రామస్తుల ఆందోళన
- సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు



పగలగొట్టిన బేకరీ పైకప్పు

నాదెండ్ల: గణపవరం బొడ్డురాయి సెంటర్ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న జై మారుతి బెంగుళూరు అయ్యంగార్ బేకరీలో చోరీ జరిగింది. బాధితుడు కర్ణాటకకు చెందిన ఏఎస్ కృష్ణమూర్తి తెలిపిన వివరాల మేరకు మంగళవారం రాత్రి 10 గంటలకు షాపును మూసి ఇంటికి వెళ్లినట్లు తెలిపాడు. బుధవారం ఉదయం షాపు తెరచి చూడగా, పైకప్పు సిమెంటు రేకులు తొలగించి సీలింగ్ పగలగొట్టి ఉండటం గమనించాడు. దుండగుడు లోనికి ప్రవేశించి సుమారు రూ.5 వేలు నగదుతో పాటు విలువైన చాక్లెట్లు, బిస్కెట్లు చోరీ చేసినట్లు గుర్తించాడు. దీనిపై నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. షాపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఉండటంతో సీసీ ఫుటేజీని పరిశీలించారు. దుండగుడు రాత్రి 12.40 గంటలకు పైకప్పు పగలగొట్టి లోనికి ప్రవేశించి నగదు, వస్తువులు దొంగిలించినట్లు రికార్డు అయింది. గడిచిన పదిరోజుల వ్యవధిలో ఐదో చోరీ సంఘటన కావటంతో స్థానికులు భయాందోళనలకు గురౌతున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మహిళలు పలుమార్లు గ్రామ పార్టీ నాయకుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సీసీ ఫుటేజీలో కనిపిస్తున్న దొంగ

మాతృ భాషాభివృద్ధికి పాటుపడాలి

- శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి
- ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



విజేతలతో పరిషత్ ప్రతినిధులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నరసరావుపేట ఈస్ట్: మాతృభాషా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పెదచెరువులోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వక్తృత్వం, తెలుగు గేయాల ఆలాపన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా చినరామిరెడ్డి మాట్లాడుతూ, మాతృభాషను ప్రతి ఒక్కరూ ప్రేమించి, విస్తరింపచేయాలని కోరారు. నేడు ప్రపంచంలో దాదాపు 45 శాతం భాషలు మృతస్థితికి చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా తెలుగు భాష సాంస్కృతిక వైతాళికులు గురజాడ అప్పారావు, గుర్రం జాషువా, గిడుగు రామ్మూర్తి తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల పాలకవర్గ సభ్యులు బత్తుల మురళి, పద్యకవి ఈవూరి మస్తాన్‌రెడ్డి, ప్రిన్సిపల్ ప్రమీల పాల్గొన్నారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందచేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

పల్నాడు రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో అంతర్జాతీయ మాతృభాషా దినో త్సవాన్ని పురస్కరించుకొని వచన కవితా రచన పద్ధతులు అనే అంశంపై సదస్సునిర్వహించారు. సదస్సుకు ప్రిన్సిపల్ డాక్టర్ కాకాని సుధాకర్ అధ్యక్షత వహించారు. సాహితి విమర్శకులు జి.లక్ష్మీనరసయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని వచన కవిత్వ తీరును వివరించారు. తెలుగు భాషా సాహిత్య సేవ చేస్తున్న యువ కవులు దారివేముల అనిల్, గుండాల రాకేష్‌లను సత్కరించారు.

మాతృభాషను పరిరక్షించుకోవాలి

చిలకలూరిపేటటౌన్: మాతృభాషను పరిరక్షించుకోవటానికి ప్రతి ఒక్కరూ ప్రతిన పూనాలని ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు చెప్పారు. బుధవారం శాఖా గ్రంథాలయంలో జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. అనంతరం పాఠశాలల విద్యార్థులకు మాతృభాషపై క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏజీపీ దాసరి చిట్టిబాబు, రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణ, జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు, సొసైటీ సభ్యులు గేరా యాకోబు, పొనుగుపాటి బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.